www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 19 సంచిక (Issue) : 160 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె. ఉ. 6.28; దుర్ముహూర్తం: మ. 12.40-1.32, మ. 3.16-4.09; అమృతఘడియలు: మ. 2.54-4.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | బెంగుళూరు సిటీ**

Bengaluru | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda and Nizamabad

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024

Bengaluru | Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda and Nizamabad

బెంగుళూరు సిటీ

ఘటప్రభ నదిలో ట్రాక్టర్ బోల్తా

● 12 మంది సురక్షితం ● ఒకరి గల్లంతు

బెంగళూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా వ్యాప్తంగా శనివారం కురిసిన భారీ వర్షాలకు నదులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. మూడళగి తాలూకా అవరాధి - నందగావ్ మధ్య ఘటప్రభ నదికి అనుబంధంగా ఉండే బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్‌ను దాటుతున్న సమయంలో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. అవరాధి నుంచి నందగావ్‌కు కూలి పనుల కోసం ట్రాక్టర్‌లో 13 మంది వెళ్తున్నారు. బ్రిడ్జిపై భారీగా నీరు ప్రవహిస్తుండడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన కూలీలు ఈత కొడుతూ గట్టు చేరారు. 12మంది ఒడ్డుకు చేరగా ఒకరు కనిపించలేదు. కులగోడ పోలీసులు వ్యక్తి కోసం గాలింపులు చేపట్టారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



బ్రిడ్జిపై కొట్టుకుపోతున్న ట్రాక్టర్



మోదీ కొలువులో

ఐదుగురికి చోటు

● నిర్మలాసీతారామన్, ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజెకు మరోసారి అవకాశం

● కూటమి కోటాలో కుమారస్వామి

● అనూహ్యంగా సోమణ్ణకు మంత్రిగిరి

● కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి ప్రాధాన్యం

బెంగళూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన వేళ కర్ణాటక బీజేపీ నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖులకు కేబినెట్‌లో చోటు కల్పించారు. రాష్ట్రం నుంచి ఐదుగురికి చోటు దక్కింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు విడతల ప్రభుత్వాల్లోనూ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. మరోసారి అదే విధానం పాటించారు. 2014లో నరేంద్రమోదీ తొలిసారి ప్రధాని అయినప్పుడు ఇదే తరహాలోనే రాష్ట్రానికి చెందిన పలువురిని కేబినెట్‌లో చేర్చుకుని కీలకశాఖలు అప్పగించారు. 2019లో రెండోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు అదే కొనసాగించారు. ప్రస్తుతం మోదీ 3.0లోనూ ఐదుగురు సీనియర్లను అక్కున చేర్చుకున్నారు. గతంలోకంటే ప్రస్తుతం కొత్త స్నేహం కలసి వచ్చింది. కేబినెట్‌లోకి ప్రస్తుతం మంత్రులుగా కొనసాగుతున్న నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె మరోసారి కొనసాగారు. అనూహ్యంగా తుమకూరు నుంచి గెలుపొందిన సోమణ్ణ కేంద్ర మంత్రి అయ్యారు. బీజేపీతో ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకున్న జేడీఎస్ కీలక నేత, మాజీ ప్రధాని దేవెగౌడ వారసుడు హెచ్‌డీ కుమారస్వామి కేంద్రమంత్రి అయ్యారు. మూడు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో కొనసాగిన కుమారస్వామి తొలిసారి కేంద్రంలో మంత్రి కావడంతో జేడీఎస్ వర్గాల్లో సంతోషం నెలకొంది.

ప్రహ్లాద్ జోషికి రెండోసారి అవకాశం



రాష్ట్రంలో జంట నగరాలైన హుబ్బళ్లి-ధారవాడలో జన్మించిన ప్రహ్లాద్‌జోషి విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరారు. బీజేపీలో సుదీర్ఘకాలంగా పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. తొలిసారి 2004 లోక్‌సభ ఎన్నికల్లో ధారవాడ నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి 2009, 2014, 2019లలో గెలుపొందుతూ వచ్చారు. గడిచిన ఐదేళ్లుగా కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గుగనులశాఖ మంత్రిగా కొనసాగారు. 2014-19 దాకా ఇదే హోదాలో రాష్ట్రానికి చెందిన అనంతకుమార్ పనిచేశారు. పార్లమెంటరీ వ్యవహారాలశాఖ రాష్ట్రానికే రెండోసారి దక్కింది. ప్రస్తుతం ప్రహ్లాద్‌జోషి మరోసారి కేంద్రమంత్రి కావడంతో ఏ శాఖ బాధ్యతలు దక్కుతాయనేది చర్చనీయాంశంగా ఉంది. ప్రహ్లాద్‌జోషి అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవ్యక్తిగా చిరపరిచితులు.

ఫైర్‌బ్రాండ్
శోభాకరంద్లాజెకు మరోసారి కిరీటం



విద్యార్థి దశనుంచే ఆర్ఎస్ఎస్ భావాలు కల్గిన శోభాకరంద్లాజె రాష్ట్ర బీజేపీలో అంచెలంచెలుగా ఎదిగి అత్యున్నత పదవులు అలంకరించిన మహిళా నేతగా రాణిస్తున్నారు. 2010లో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా, పౌర ఆహార సరఫరాలు, అనంతరం విద్యుత్‌శాఖ మంత్రిగా రాష్ట్రంలో కీలకమైనశాఖల్లో పనిచేశారు. ఆమె పనిచేసిన ప్రతిశాఖలోనూ కొత్త పాలసీలు తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. 2019లో రాష్ట్ర రాజకీయాలను వీడి జాతీయ రాజకీయాలవైపు వెళ్లారు. ఉడుపి-చిక్కమగళూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో వ్యవసాయశాఖ సహాయమంత్రిగా కొనసాగారు. ఇటీవలి ఎన్నికల్లో ఆమె బెంగళూరు ఉత్తర నుంచి పోటీ చేసి తిరుగులేని మెజారిటీ సాధించారు. మరోసారి కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కింది.

రాష్ట్ర కోటా నుంచి నిర్మలా సీతారామన్



రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యురాలిగా వ్యవహరిస్తున్న నిర్మలా సీతారామన్ మరోసారి కేంద్ర మంత్రి అయ్యారు. ప్రస్తుతం ఆమె కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఇంతకుముందు రక్షణమంత్రిగాను, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగాను కొనసాగారు. నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి చెందినవారు కాకున్నా కన్నడిగులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. దక్షిణ భారతవాసిగా నిర్మలా సీతారామన్ గుర్తింపు పొందారు. శాఖ ఏదైనా సమర్థవంతంగా నిర్వహిస్తారనే గుర్తింపు పొందా రు. కేంద్ర కేబినెట్‌లో కీలకమైన శాఖల మంత్రిగా నిర్మలాసీతారామన్ వ్యవహరిస్తున్నారు. ఆమె బెంగళూరు నగరంలో గడిపేందుకు ఇష్టపడుతుంటారు. బెంగళూరుకు వస్తే సాధారణ మహిళగా ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్లడం, హోటళ్లలో మిత్రులతో కలసి టిఫిన్ చేయడం ఆమెకు ఇష్టమైనది. ఇటీవలే కుమార్తె వివాహం కూడా రాష్ట్రంలోనే సాదాసీదాగా నిర్వహించారు.

సోమణ్ణను వరించిన అదృష్టం



రాష్ట్ర బీజేపీలో సోమణ్ణది ప్రత్యేకమైన శైలి. ఆయన ఎక్కడ పోటీ చేసినా రాణిస్తారనే పేరొందారు. రామనగర జిల్లా దొడ్డమారలవాడి గ్రామంలో జన్మించిన ఆయన బెంగళూరులో స్థిరపడ్డారు. బెంగళూరు కార్పొరేటర్‌గా రాజకీయాల్లో ప్రవేశించి వెనుతిరగలేదు. విజయనగర, గోవిందరాజనగర నియోజకవర్గాల్లో ఆయన గెలుపొందుతూ వచ్చారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా వ్యవహరించిన సోమణ్ణ దేవదాయ, పౌర ఆహార సరఫరాలు, ప ట్టు పరిశ్రమ, ఉద్యానవన శాఖల మంత్రిగా కొనసాగారు. బసవరాజ్ బొమ్మై కేబినెట్‌లో గృహ వసతిశాఖ మంత్రిగా రెండేళ్లపాటు వ్యవహరించారు. ఏడాదిక్రితం శాసనసభ ఎన్నికల్లో వరుణ, చామరాజనగర నియోజకవర్గాలో పోటీ చేసి తొలిసారి ఓటమి చెందారు. అధిష్టానం సూచించిందని సొంత నియోజకవర్గాన్ని వీడి రెండుచోట్ల పోటీ చేశారు. అధిష్టానం మరోసారి తుమకూరు లోక్‌సభకు అవకాశం ఇవ్వగా విజయం సాధించారు. తొలిసారి లోక్‌సభకు వెళ్లిన సోమణ్ణ కేంద్రమంత్రి అయ్యారు.

కూటమి కోటాలో కుమారస్వామి



రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నేతగా రాణించి దాదాపు అన్ని పదవులు అలంకరించిన కుమారస్వామి తొలిసారి కేంద్రమంత్రి అయ్యారు. రాష్ట్రంలో నాలుగు దశాబ్దాల ప్రాంతీయ పార్టీ జేడీఎస్ వ్యవస్థాపకుడు దేవెగౌడ జాతీయ స్థాయిలో రాణించారు. ప్రధాన మంత్రి పదవిని ఆయన అలంకరించారు. దేవెగౌడ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. రాష్ట్ర రాజకీయాల్లో అపారమైన అనుభవం కల్గిన నేతగా గుర్తింపు పొందారు. ఇటీవల బీజేపీతోపొత్తు పెట్టుకున్న నేపథ్యంలోనే మండ్య నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తొలిసారి లోక్‌సభ ఎన్నికైన కుమారస్వామి కేంద్రకేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు.

చదువుకున్నోళ్లే.. ఓటు వేయడం రాదు


● 6 స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 28వేల చెల్లని ఓట్లు



బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వారంతా విద్యావంతులే.. కానీ ఓటు వేయడం కూడా రాని దౌర్భాగ్య స్థితిలో ఉండిపోయారు. రాష్ట్రంలో మూడు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో అత్యంత ఎక్కువగా చెల్లని ఓట్లు నమోదు కావడం సర్వత్రా ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సార్వత్రిక, స్థానిక ఎన్నికల్లో సామాన్యులు కనీస అవగాహన లేనివారు పోలింగ్‌లో పాల్గొంటారు. వారు ఓటు వేసే విషయంలో పొరపాట్లు చేయడం సహజం. కానీ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లోనూ 28వేలకుపైగా ఓట్లు చెల్లకుండా పోయాయి. పోలింగ్ సమయంలో ప్రాధాన్యత పరంగా గుర్తులు నమోదు చేయాల్సి ఉంటుంది. కొందరు ప్రాధాన్యతను సక్రమంగా నమోదు చేయకుండా తప్పు చేశారు. బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గంలో 80,080 ఓట్లు పోల్ అయ్యాయి. గెలుపొందిన అభ్యర్థి రామోజిగౌడకు 36,729 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి దేవేగౌడ 24,888 ఓట్లు నమోదయ్యాయి. మెజారిటీ 11,841 ఉంది. చెల్లని ఓట్లు 8,482 ఓట్లు ఉండడం గమనార్హం.

నియోజకవర్గాల వారిగా చెల్లని ఓట్లు

ఈశాన్య పట్టభద్రుల స్థానంలో 12,513 ఓట్లు, బెంగళూరు పట్టభద్రుల స్థానంలో 8,482, నైరుతి పట్టభద్రుల స్థానంలో 5,115 ఓట్లు చెల్లనివిగా ఉన్నాయి. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 1049 ఓట్లు, నైరుతి ఉపాధ్యాయ స్థానంలో 821, ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 704 ఓట్లు చెల్లనివిగా ఉన్నాయి. ఆరు స్థానాలకు సంబంధించి 28,684 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. చెల్లని ఓట్లు సక్రమమైతే ఫలితాలు తారుమారు అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉపాధ్యాయ నియోజకవర్గాల్లోనూ వందలాది ఓట్లు చెల్లనివిగా మారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.36	1,581.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2655	139
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	08	247
సామర్థ్యం (టీఎంసీలు)	4.17	5.02

శరణుల జీవితం అందరికీ ఆదర్శం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

బళ్లారి సిటీ, జూన్9: బసవ శరణులు సాదాసీదాగా జీవించి నేటికి ఆదర్శంగా నిలుస్తున్నారని నగరంలోని బాలికల ప్రభుత్వ కళాశాల పూర్వ అధ్యాపకులు శ్రీనివాస మూర్తి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని హందాలు గ్రామంలోని శివశరణుల మఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన శివ చింతన కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. కాయకం అంటే కేవలం కడుపు నింపుకోవడానికి చేసే అత్యాశతో కూడిన వ్యాపారం కాదని, అది నిజమైన స్వచ్ఛమైన జీవన విధానమన్నారు. బసవ శరణులు కాయకానికి, దాసోహానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సరళాదేవి కాలేజీ ప్రొఫెసర్ దస్తగిరిసాబ్ మాట్లాడుతూ శరణులు అప్పట్లో సమాజంలోని అనేక మూఢనమ్మకాలను ఖండించి నైతిక చైతన్యం కలిగించారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పంపనగౌడ మాట్లాడుతూ శరణులు అనుకూల వైఖరికి స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున గౌడ మాట్లాడుతూ సంజీవిని వంటి అమరవీరుల ఆలోచనలను అర్థంచేసుకుని పాటించాలన్నారు. ఈసందర్భంగా వీరేశ్‌స్వామి, నీలకంఠప్ప, డాక్టర్ జయప్రకాశ్,డాక్టర్ శివలింగప్ప హంద్యాలు, చందాబాషా, సుమనారెడ్డి, వనజాక్షి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు ఎద్దు మృతి

కంప్లి, జూన్ 9: విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకాలో కుప్పనకెరె గ్రామంలో చలవాది ప్రకాష్ అనే రైతుకు చెందిన ఎద్దు పాము కాటుతో మృతి చెందింది. ఎద్దులు కొండ ప్రాంతంలో వుండటంతో విషపూరితమైన పాము ఎద్దును కరవడంతో వెంటనే దాని నోటిలో నుంచి నురగ వచ్చి మృతి చెందింది. ఇది గమనించిన రైతు చలవాది ప్రకాష్ తన ఎద్దు మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయ్యాడు.

ఏళుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు



కంప్లి, జూన్ 9 : బుక్కసాగరలో వెలసిన ఏళుపడగల నాగప్ప ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి వివిధ ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే రాహు, కేతువుకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టింది.

అడ్డూ ఆపులేని ఎర్రమట్టి రవాణా



ఎర్రమట్టి తరలిస్తున్న భారీ వాహనం

సిరుగుప్ప, జూన్ 9 : సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా టక్కలకోట, అశోకోట, పట్టిగనూరు, ఇతర ప్రాంతాలలో రేయింబవళ్లు యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ రవాణా కొనసాగుతోంది. భారీ వాహనాలకు రూ. 8 వేలు నుంచి రూ. పది వేలు వరకు ఎర్రమట్టి విక్రయిస్తున్నారు. మైనింగ్ అధికారులు అక్రమ రవాణాను చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. జిల్లా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి అక్రమ ఎర్రమట్టి రవాణాకు అడ్డు కట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముచ్చటగా మూడోసారి..

- ప్రమాణ స్వీకారం చేసిన ఎన్డీఏ ప్రభుత్వం
- హొస్పేట, కంప్లిలలో అంబరాన్నంటిన కార్యకర్తల సంబరాలు



నగరంలో లడ్లను పంపిణీ చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

బళ్లారి సిటీ, జూన్ 9: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడవ సారి ప్రధానమంత్రి అయిన సందర్భంగా బీజేపీ కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. హొసపేటలోని సిద్ధివినాయకుడి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసిన కార్యకర్తలు,, దేశాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న మోడీకి మూడోసారి మెజారిటీనిచ్చారని మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ తనయుడు సిద్దార్థసింగ్ అన్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు, పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు. పాండు రంగ కాలనీతోపాటు పలు ప్రాంతాల్లో లడ్లను పంపిణీ చేశారు.

బళ్లారిరూరల్, జూన్ 9 : బళ్లారి నగరంలో రాయల్ సర్కిల్ లో ప్రధాని నరేంద్ర మోడీ మూడవ సారి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం సాయంత్రం 7 గంటలకు బీజేపీ నాయకులు,



కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు

కార్యకర్తలు కార్పొరేటర్లు పెద్దఎత్తున బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మోదీ జిందాబాద్ అంటూ ర్యాలీలు చేస్తూ నగరంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మోకా అనిల్ నాయుడు, నగర అధ్యక్షులు బీ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, బళ్లారి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సోమనగౌడ, కార్పొరేటర్లు హనుమంతు, సురేంద్ర, మల్లన్నగౌడ, కేదారనాథ్, జనార్దన్, బళ్లారి మహిళా మోర్చ అధ్యక్షురాలు సుగుణ, ఉపాధ్యక్షురాలు అరుణ, సాధన హిరేమఠ్, విజయలక్ష్మీ, పుష్పలత, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు జలకళ

- జలాశయానికి జోరుగా చేరుతున్న వరదనీరు

బళ్లారి గాంధీనగర్, జూన్ 9: తుంగభద్ర పై భాగంలో ఉన్న పడమటి కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర నదికి వరదనీరు వచ్చి చేరుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా కర్ణాటక రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే శివమొగ్గ ప్రాంతంలో ఉన్న తుంగ జలాశయం పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉండడంతో ఏ క్షణమైనా దిగువకు నీరు వదిలే అవకాశం ఉంది. ప్రస్తుతం టీబీ డ్యాంకు ఆదివారం 8గంటల సమయానికి 2,655 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు. గత ఏడాది వర్షాభావం నెలకొనడంతో ఇదే సమయానికి కేవలం 139 క్యూసెక్కుల మాత్రమే నీరు చేరిందని, ప్రస్తుతం ఏడాది జూన్ మొదటి వారం నుండే జలాశయానికి వరద నీటి చేరుతుండడంతో జీరో స్థాయికి పడిపోయిన తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం కొద్దిగా జలకళ కనిపిస్తోంది. తుంగభద్ర జలాశయం ఎత్తు 1633 అడుగులు కాగా, ప్రస్తుతం 1579.36 అడుగులకు నీరు చేరుకుందని ప్రస్తుతం జలాశయంలో 4.17టిఎంసిల నీరు చేరిందని జలాశయం అధికారులు తెలిపారు.



వరదనీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

భక్తులు అందించే కానుకలే అతడి చదువుకు ఆధారం

జాతీయ స్థాయిలో 3103వ ర్యాంకు సాధించిన పేదింటి బిడ్డ



కుమారుడికి మిఠాయి తినిపిస్తున్న తండ్రి రామణ్ణ

బళ్లారి గాంధీనగర్, జూన్ 9: లక్షలాది రూపాయిలు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లలో కోచింగ్ తీసుకున్నా...జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించలేని ఎందరో విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచాడు ఓ పేదింటి విద్యార్థి. విజయనగర జిల్లా, హూవినహడగలి మైలార గ్రామానికి చెందిన పక్కీరీశ నీట్‌లో 720 మార్కులకు గాను 695మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 3103 ర్యాంకు సాధించి జిల్లాకు పేరుతీసుకొచ్చాడు విద్యార్థి పక్కీరీశ. విద్యార్థి పక్కీరీశ తండ్రి రామణ్ణ మైలార దేవాలయంలో గొరవప్పగా సేవలు అందిస్తూ భక్తులు ఇచ్చే కానులతోనే జీవనం సాగిస్తున్నాడు. తల్లి కెంచమ్మ కూలీ పనులకు వెళుతుంది. విద్యార్థి పక్కీరీశ మైలారలో ప్రాథమిక విద్య, మొదలగట్టి మొరార్జీ వసతి పాఠశాలలో హైస్కూలు విద్య పూర్తి చేశాడు. 10వ తరగతిలో 99 మార్కులు సాధించిన అతడికి దావణగెర టీమ్ అకాడమీ వారు పియుసి, నీట్, సిఇటిలో సంపూర్ణంగా ఉచితంగా శిక్షణ ఇచ్చారు. టీమ్ అకాడమీ బోధక సిబ్బంది ప్రోత్సాహం, కఠినమైన శ్రమతో ముందుకెళ్ళిన పక్కీరీశ గ్రామీణ విద్యార్థులకు నీట్‌లో ర్యాంకు పొందడం కష్టమేమి కాదని నిరూపించాడు. తమది పేద కుటుంబమని, భక్తులు ఇచ్చే కానుకల ద్వారానే జీవనం సాగిస్తున్నట్లు, నీట్‌లో ఉత్తమ ర్యాంకు పొందిన తన కుమారుడి విజయం తమకు ఎంతో తృప్తిని ఇచ్చిందని తండ్రి రామణ్ణ అభిప్రాయం వ్యక్తం చేశాడు.

ఎంపీ తుకారామ్‌కు సన్మానం



ఎంపీ తుకారామ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి, జూన్ 9 : బళ్లారి ఎంపీ ఈ తుకారామ్ దంపతులను కురుగోడు బ్లాక్, మహిళా మోర్చా ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బసవరాజు మాట్లాడుతూ ఆయన మంచితనం, సేవలు గుర్తుంచుకుని ప్రజలు ఆయనను భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అనంతరం తుకారామ్ మాట్లాడుతూ తాను ప్రజలకు వెన్నంటే వుంటూ ప్రజలకు సేవలు చేపడతామన్నారు. ఏ సమస్య వచ్చినా తాము వెంటే వుంటూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్ రెడ్డి, పంపాపతి, రామన్న, మంజునాథ్, హేమా మంజునాథ్, ఆనంద్ పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా అక్రమ నిర్మాణాలు

- డ్రైనేజీలపైనే కట్టడాలు, వ్యర్థపదార్థాలు అందులోనే
- రోడ్డు పైకి చేరిన వాన నీరు, ఇబ్బందుల్లో ప్రజలు

బళ్లారి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి నిబంధనలు పాటించకుండా డ్రైనేజీల పైనే అక్రమ కట్టడాలు నిర్మించడం, వీటికి తోడు వ్యర్థపదార్థాలు అన్నీ డ్రైనేజీల్లో వేసి నీరు పారదల కాకుండా చేయడం కారణంగా వాన నీటి ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. నీరు డ్రైనేజీల్లో ప్రవహించేందుకు మార్గం లేని కారణంగా రోడ్డపైకి చేరి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారింది. వార్డుల్లో పర్యవేక్షించి అక్రమ కట్టడాలు జరగకుండా చూడాల్సిన నగర పాలిక అధికారులు చేతివాటం ప్రదర్శించడం కారణంగా అనేక అడ్డంకులు ఎదురౌతున్నాయి.

టౌన్ ప్లానింగ్ సరిగ్గాలేక పోవడం మూలంగా చాలా వరకూ వీధులు ముంపునకు గురౌతున్నాయి. పూర్వం నీటి పారుదలకు నల్లాలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో నీరు నల్లాల ద్వారా ప్రవహిస్తే అవి వీధుల్లోకి చేరకుండా కాలవల ద్వారా ప్రవహించి నదుల్లోకి చేరే అవకాశం ఉండేది. అయితే కాలక్రమేణా అవి అక్రమణకు గురయ్యాయి. కాలువపై కొన్నిచోట్ల భవనాలు, లేదా ఇంటికి వెళ్లేందుకు స్టెప్పులు నిర్మించారు. మరి కొందరు ఏకంగా కాలవలను పూడ్చేసి ఇళ్లు కట్టుకున్నారు.

ఇక డ్రైనేజీలు కూడా పూర్తిగా మూసుకుపోతున్నాయి. అక్కడ ఇళ్లు నిర్మించే వ్యక్తులు వ్యర్థపదార్థాలు అన్నీ డ్రైనేజీల్లోవేస్తున్నారు. మరి కొందరు ఇళ్లలో వాడిపడేసే పదార్థాలు కూడా డ్రైనేజీల్లో వేస్తున్నారు. దీని కారణంగా వానాకాలంలో నీటి పారుదలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఫలితంగా నీరు నిలబడి దోమలు ఉత్పత్తి జరిగి అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి.



ఫోర్టుకు వెళ్లే దారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

బల్లారి నగరంలో కౌల్‌బజార్, హూసేన్‌నగర్, బండీమోట, కాకర్లతోట, గుగ్గరహట్టి, సత్యనారాయణపేట, గాంధీనగర్, కప్పగల్లు రోడ్డు, తాళ్లూరు రోడ్డు, పార్వతీనగర్, తిలక్‌నగర్, విద్యానగర్, బండిహట్టి, తదితర ప్రాంతాలలో నీరు రోడ్డుపైనే నిలబడిపోతోంది. నీటి పారుదలకు అంతరాయం ఏర్పడడంతో నీరు ఎటు పోవాలో తెలియక ఇళ్లలోకి వెళుతోంది. కేవలం మానవ తప్పిదం కారణంగా డ్రైనేజీలు మూత పడి, నగరం ముంపునకు గురవుతోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు, ప్రజలు సమన్వయంతో నీరుపారుదలకు ఏర్పాటు చేసిన కాలవలను అక్రమించకుండా ఉంటే ప్రమాదం నుండి బయట పడతామని విజ్ఞులు అంటున్నారు.

కంప్లిలో బీజేపీ సంబరాలు



అంబేడ్కర్ కూడలిలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కంప్లి, జూన్ 9: నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా మూడవసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా కంప్లి పట్టణం అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రిగా వుంటూ ఎన్నో పథకాలు, సేవలు చేపట్టి గుర్తింపు పొందిన నాయకుడు కాబట్టి మూడవసారి కూడా ప్రధానమంత్రిగా ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సంబరాలలో బ్రహ్మయ్య, పురుషోత్తమ్, సుధాకర్, సిద్దప్ప, రామన్న, వీఎల్ బాబు, రామాంజినేయులు, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

కెలవరపల్లి డ్యాం వద్ద సెంట్రల్ రివర్ వాటర్ సెక్టార్ సర్వే



కూష్వీందర్ వతీరా నేతృత్వంలో సర్వే చేస్తున్న అధికారులు

హొసూరు జూన్ 9: హొసూరు సమీపంలోని కెలవరపల్లి డ్యామ్ వద్ద సెంట్రల్ రివర్ వాటర్ అథారిటీ చైర్మెన్ నేతృత్వంలో అధికారులు సర్వే నిర్వహించారు. కర్ణాటకలోని బెంగళూరు ప్రాంతం నుంచి వెలువడే మురుగునీరు. పారిశ్రామిక రసాయన వ్యర్థాలు దక్షిణా పినాకిని నదిలో కలిసి హొసూరు సమీపంలోని కెలవరపల్లి అనకట్టకు చేరుతున్నాయి. దీంతో డ్యాం నుంచి విడుదలయ్యే నీటిల్లో రసాయన నురుగుతో పాటు తీవ్ర దుర్వాసన వస్తోంది. హొసూరు ప్రాంతంలోని వ్యవసాయ భూములు, పశువులు, ఈ వ్యర్థ జలాల భారిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆధివారం సెంట్రల్ రివర్ వాటర్ కమిషన్ చైర్మెన్ కూష్వీందర్ వతీరా నేతృత్వంలో కర్ణాటక, తమిళనాడు నీటిపారుదల శాఖలకు చెందిన 15 మంది అధికారులు తనిఖీలు నిర్వహించారు. హొసూరు సమీపంలోని కొడియాళం బ్యారేజీ, హొసూరులోని కెలవరపల్లి డ్యాం వద్ద సర్వేలు చేపట్టారు. దక్షిణా పినాకిని నది నీటిల్లో విషపూరిత వ్యర్థ జలాలు కలుస్తున్నాయని ఫిర్యాదు మేరకు అధికారులు ఈ విచారణ చేపట్టారు. తనిఖీ అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం నది నీటిని పరిశీలించామని, నిరంతరం పరిశీలన ఆధారంగా ఈ విషయంలో తగు చర్యలు తీసుకుంటామన్నారు. కెలవరపల్లి అనకట్ట, చెక్‌డ్యాం, నదీజలాలు, తదితరాలపై అధ్యయనం చేస్తే సరిపోదని, నంది కొండ నుంచి ప్రారంభమై కెలవరపల్లి డ్యాం వరకు వ్యర్థ జలాలు కలుస్తున్నాయని, అధికారులు కచ్చితమైన విచారణ జరిపి వ్యర్థ జలాలు కలిసే చోట నిషేధం విధించాలని కొందరు రైతులు అంటున్నారు.

సోనియాను కలిసిన గోపీనాథ్

హొసూరు జూన్ 9: 1.92 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన హొసూరు కాంగ్రెస్ ఎంపీ గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుందురై నేతృత్వంలో ఢిల్లీ వెళ్లారు. అనంతరం తమిళనాడులో గెలిచిన కాంగ్రెస్ ఎంపీలంతా ఢిల్లీలో సోనియా గాంధీ నివాసానికి వెళ్లి ఆమెను కలిశారు. జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గేతో భేటీ అనంతరం సోనియా గాంధీ అందరికీ విందుతో శుభాకాంక్షలు తెలిపారు.

హొసూరులో ఏరోస్పేస్ మెకానికల్ ఇంజనీర్స్ సమావేశం

హొసూరు జూన్ 9 : హొసూరులోని ఏరోస్పేస్ అండ్ మెకానికల్‌లోని సొసైటీ ఆఫ్ ఇంజనీర్స్ 10వ కౌన్సిల్ సమావేశం హొసూరులోని అధియమాన్ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్‌లో జరిగింది, దీనికి సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురుగేషన్ స్వాగతం పలికారు. అధ్యక్షత వహించిన రాష్ట్రపతి డాక్టర్ అరువుడైనంబి, ప్రత్యేక అతిథి భారతీయుడు ఇంజీనీర్ల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ, కళాశాల అధ్యాపకులు, ఆచార్యులు ఇలాంటి సంఘాలను ఆదరించి అభివృద్ధికి పాటుపడాలన్నారు. అంతకుముందు తమిళనాడుకు చెందిన రెండో జాతీయ నాయకుడిగా డాక్టర్ రంగనాథ్‌ను అభినందిస్తూ స్మారక బహుమతులు అందజేశారు. అనేక మంది అత్యుత్తమ కళాశాల ప్రొఫెసర్లను అవార్డులతో సత్కరించారు. అసోసియేషన్ కొత్త నిర్వాహకులు డాక్టర్ మంజులదేవి , డాక్టర్ తవమణిలకు సంస్థ కార్యదర్శి నియామక కమీషన్ ఇచ్చారు. కార్యక్రమం ముగింపుల్లో సొసైటీ అసోసియేట్ డైరెక్టర్ మార్‌తాండం ధర్మరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్నవారికి జ్ఞాపిక బహూకరణ

మాన్విలో జోరు వాన : రాకపోకలకు అంతరాయం

రాయచూరు, జూన్ 9 : జిల్లాలోని మాన్వి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కురిసిన జోరు వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గుంతల్లో నీరువచ్చి చేరి చేరడంతో కొద్దిసేపు దారి కనిపించక వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉన్న వాతావరణం ఒక్క సారిగా మధ్యాహ్నం అనంతరం వర్షంగా మారింది. జోరుగా వాన కురువడంతో పట్టణంలోని వీధి వ్యాపారులు అసౌకర్యానికి గురయ్యారు.

ఎమ్మెల్సీగా ఎన్నికైన వసంత్ కుమార్‌కు ఘన స్వాగతం



నగరంలో వసంత్ కుమార్‌కు ఘన స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

రాయచూరు, జూన్ 9 : శాసన మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై తొలి సారి నగరానికొచ్చిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వసంత్ కుమార్‌కు ఘనస్వాగతం పలికారు. ఇటీవల రాష్ట్ర శాసనసభ నుంచి శాసన మండలికి జరిగిన ఎన్నికల్లో జిల్లాకు చెందిన వసంత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన రాష్ట్ర చిన్ననీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు వాసన మండలికి ఎన్నికైయ్యారు. మండలి సభ్యుడిగా ఎన్నికైన అనంతరం బెంగళూరు నుంచి ఆదివారం నగరానికి చేరుకుంటున్న వసంత్ కుమార్‌కు గిల్లేసుగూరు, గుంజళ్ళి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి మిఠాయిలు తినిపించారు.

ఇండియా టీం గెలుపు కోసం పూజలు

రాయచూరు, జూన్ 9 : టీ-20 క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం భారత్-పాక్ జట్టు తలపడుతున్న నేపద్యంలో ఇండియా టీం గెలుపు కోసం స్థానిక క్రీడాకారులు ఆదివారం నగరంలోని ఎన్‌ఐజీ కాలనీలో కాశి విశ్వానాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన టీ-20 కప్ పోటీల్లో భారత దేశం పాకిస్తాన్ జట్టుతో తలపడుతున్న నేపధ్యంలో స్థానిక క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. తమ ఇండియా టీం గెలువాలని ఆకాంక్షిస్తు స్వామి వారికి అభిషేకం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఎంఎస్ గోపాలకృష్ణన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత ఎంఎస్ గోపాలకృష్ణన్ 1931 జూన్ 10న చెన్నైలోని మైలాపూర్ ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో వయోలిన్ కళాకారుడు. లాల్‌గుడి జయరామన్, టీఎన్ కృష్ణన్‌లతో కలసి ముగ్గురూ 'వయోలిన్ త్రయం'గా ఉండేవారు. 8వ యేటనే తొలి ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు పొందారు. శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడునుంచి స్ఫూర్తిగా ముందుకు సాగారు. ఐదు దశాబ్దాలపాటు సంగీత సేవలందించారు. పద్మశ్రీ, కళైమామణి, సంగీత కళానిధి తదితర పురస్కారాలు పొందారు. 2013 జనవరి 3న కన్నుమూశారు.

పరుచూరి గోపాలకృష్ణ (పుట్టినరోజు)



డాక్టర్ పరుచూరి గోపాలకృష్ణ 1946 జూన్ 10న కృష్ణా జిల్లా పమిడిముక్కల ప్రాంతంలో జన్మించారు. సినిమా రంగంలో స్క్రీన్ రైటర్, కథా రచయిత, మాటల రచయిత, నటుడు, దర్శకుడు, కవి, నాటక రచయిత, నవలా రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సోదరుడు వెంకటేశ్వరరావుతో కలసి పరుచూరి బ్రదర్స్‌గా పేరొందారు. 350కుపైగా సినిమాలకు రచనలు చేశారు. బుల్లితెరపై పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాత, సహ వ్యాఖ్యాత, నటుడు, రచయిత, దర్శకుడిగా వ్యవహరించారు. దర్శకత్వం చేసిన తొలి సినిమాకే నంది అవార్డు అందుకున్నా అప్పట్లో ఎన్టీఆర్ సలహాతో రచనా రంగానికే పరిమితమయ్యారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో గౌరవ ప్రొఫెసర్‌గా స్క్రీన్‌ప్లే క్లాసెస్ నిర్వహించారు. పలు పురస్కారాలు పొందారు.

దేవనూరు మహదేవ (పుట్టినరోజు)



దళిత ఉద్యమనేత దేవనూరు మహదేవ 1948 జూన్ 10న మైసూరు జిల్లా నంజనగూడులో జన్మించారు. కన్నడ సాహిత్య రచయిత, ద్యావనూరు, ఒడలాళ, కుసుమబాలె, తదితర రచనలు పేరొందాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. అధ్యాపక వృత్తికి రాజీనామా చేసి వ్యవసాయంవైపు సాగారు. కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, పద్మశ్రీతోపాటు పలు అవార్డులు అందుకున్నారు.

ప్రకాశ్ పదుకొనె (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత ప్రకాశ్ పదుకొనె 1955 జూన్ 10న బెంగళూరులో జన్మించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. 1980లో వరల్డ్ నెంబరు 1 ర్యాంకుగా నిలిచారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలుపొందిన తొలి భారతీయుడు. తండ్రి రమేశ్ పదుకొనె బాటలో క్రీడల్లో కొనసాగారు. 1978లో కామన్వెల్త్ గేమ్స్ పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకం పొందారు. అర్జున అవార్డుతోపాటు పలు గౌరవాలు అందుకున్నారు. గీత్‌సేథితో కలసి ఒలింపిక్ గోల్డ్‌క్వెస్ట్‌ను స్థాపించి క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా, ఇండియన్ నేషనల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు.

నందమూరి బాలకృష్ణ (పుట్టినరోజు)



నటసార్వభౌమ ఎన్టీఆర్ కుమారుడు నందమూరి బాలకృష్ణ 1960 జూన్ 10న జన్మించారు. తెలుగుసినిమా నటుడు, నిర్మాతగానే కాకుండా ఎమ్మెల్యేగాను రాజకీయాల్లో రాణిస్తున్నారు. 14వ యేటనే 1974లో తాతమ్మకల సినిమాతో వెండితెరకు పరిచయ మయ్యారు. తండ్రితో కలసి వైవిధ్యమైన పాత్రల్లో కూడా నటించారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లోనూ తనదైన ముద్రను చాటారు. ఫిలింఫేర్, నంది అవార్డులు అందుకున్నారు.

సుందర్ పిచాయ్ (పుట్టినరోజు)



సుందర్ పిచాయ్‌గా చిరపరిచితులైన పిచాయ్ సుందరరాజన్ 1972 జూన్ 10న మద్రాస్‌లో జన్మించారు. ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌కు మాతృసంస్థ అయిన అల్ఫాబెట్ సంస్థ సీఈఓ. 2004లో గూగుల్ సంస్థలో చేరాక గూగుల్ క్రోమ్, క్రోమ్ ఓఎస్, గూగుల్ డ్రైవ్‌తోపాటు జీమెయిల్, గూగుల్ మ్యాప్స్ వంటివి అభివృద్ధి చేశారు. ఇంటర్నెట్‌లో గూగుల్‌కు తిరుగు లేదనేంతగా తీర్చిదిద్దారు. 2016, 2020లలో టైమ్ మ్యాగజైన్ టాప్ 100 జాబితాలో ప్రపంచంలో అత్యంత ప్రభావంతులైన వ్యక్తులలో ఒకరిగా నిలిచారు. 2022లో 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు.

దేవేంద్ర ఝఝారియా (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత దేవేంద్ర ఝఝారియా రాజస్థాన్‌లో 1981 జూన్ 10న జన్మించారు. పారా ఒలింపిక్స్ చరిత్రలో భారత్ తరఫున వ్యక్తిగతంగా రెండు స్వర్ణపతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడిగా తనదైన గుర్తింపు పొందారు. 2004 ఏథెన్స్ పారా ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో తొలి బంగారు పతకం, 2016 రియో ఒలింపిక్స్‌లో రెండోసారి బంగారు పతకం సాధించారు. 2021లో టోక్యో పారాఒలింపిక్స్‌లో రజత పతకం సాధించారు. పద్మభూషణ్, పద్మశ్రీ, అర్జున, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు అందుకున్నారు.

ఇండోర్ స్టేడియానికి ఎన్టీఆర్ పేరు

పెనుకొండ రూరల్, జూన్ 9: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురానికి వెళ్లే రహదారిలో ఇండోర్ స్టేడియానికి టీడీపీ నాయకులు ఎన్టీఆర్ పేరు పెట్టారు. పరిటాల డిగ్రీ కళాశాల మైదానంలో తెలుగుదేశం హయాంలో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం పేరుతో క్రీడా వికాసకేంద్రం నిర్మించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఆదివారం టీడీపీ స్థానిక నాయకులు ఇండోర్ స్టేడియానికి ఉన్న వైఎస్ఆర్ బోర్డు తొలగించి, ఎన్టీఆర్ బోర్డు అమర్చారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం అంతర్మథనం

» ఓటమికి కారణాలపై సిద్ధమవుతున్న నివేదికలు

బెంగళూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 15కుపైగా స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 9కే పరిమితమైంది. పార్టీ ఎక్కువ స్థానాలు సాధించకపోవడానికి గల కారణాలపై అధిష్ఠానం తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. లోక్‌సభలో ప్రతిపక్షనేతను ఎన్నుకునేందుకు శనివారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పలు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది. ప్రధానంగా కర్ణాటకకు సంబంధించి సుదీర్ఘంగా చర్చ జరిగినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూడా త్వరలోనే రాష్ట్రాలవారీగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్షలు జరుపుతామని తెలిపినట్టు సమాచారం. కర్ణాటకలోనూ త్వరలోనే భేటీ ఉంటుందని అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. సీడబ్ల్యూసీ సభలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పాల్గొన్నారు. ప్రధానంగా ప్రస్తుత ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు గ్రామీణ ప్రాంతాల ఓట్లను బాగానే సాధించారని, అయితే నగర ప్రాంతాలలో ఎందుకు మద్దతు ఇవ్వలేదనే అంశంపైనా చర్చించదలిచినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఏడాదికిందట జరిగిన శాసనసభ ఎన్నికల్లో 224 స్థానాలకు గాను ఏకంగా 135 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఈ లెక్కన లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 15-18 స్థానాలు గెలుపు అంచనా వేశారు. సీఎం 18స్థానాలకు ఢోకా లేదని నిరంతరంగా చెప్పుకొచ్చారు. డీసీఎం, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు డీకే శివకుమార్ 20 స్థానాలు దాటుతామని ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు. ఎగ్జిట్‌పోల్స్‌లో 9 స్థానాలకు మించి ఏ సర్వే కూడా స్పష్టం చేయలేదు. ఎగ్జిట్‌పోల్స్ తర్వాత కూడా సీఎం, డీసీఎంలు మా నిర్ణయంలో మార్పు లేదన్నారు. డీసీఎం డీకే శివకుమార్ శాసనసభ ఎన్నికల్లో 135 స్థానాల్లో గెలుస్తామని స్పష్టంగా చెప్పానని, నా వ్యక్తిగత సర్వే ప్రకారం 20కు తగ్గవన్నారు. కానీ కేవలం 9 స్థానాల్లో మాత్రమే విజయం సాధించారు.



ప్రియాంకగాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీకే శివకుమార్

బెంగళూరు నగర పరిధిలో మూడు చోట్ల ఓటమి

బెంగళూరు నగర పరిధిలోని 3 స్థానాలతో పాటు బెంగళూరు గ్రామీణలో మాకు ఎదురే లేదని చెప్పుకున్న నేతలు 4స్థానాల్లో ఓటమి చవిచూశారు. మైసూరు, మండ్య తో పాటు ఉత్తరకర్ణాటకల్లో నమ్మకం పెట్టుకున్న స్థానాల్లో ఓడిపోయారు. రెండు రోజులక్రిందట బెంగళూరుకు వచ్చిన రాహుల్‌గాంధీ సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. నివేదికలో ఎవరిని తప్పుబడతారనేది కుతూహలంగా ఉంది. మరోవైపు ఓటమికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులను బాధ్యులను చేయాలని, బాధ్యులను చేసే అంశంపైనా రాహుల్‌గాంధీ ప్రస్తావించారు. రాష్ట్ర పార్టీ నుంచి నివేదిక రూపొంది అధిష్ఠానం సమీక్ష జరిపితే కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని కేబినెట్‌లో మార్పులకు అధిష్ఠానం సూచించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ముందంజలో ఉన్నా బీజేపీ అభ్యర్థులతో చేతులు కలిపి లోపాయకారీగా పనిచేశారనే విమర్శలు ఉన్నాయి. ఢిల్లీ నుంచి వెనుతిరిగి వచ్చిన సీఎం, డీసీఎంలు అధిష్ఠాన సూచనలకు అనుగుణంగా 18మంది మంత్రుల కార్యవైఖరిపై నివేదిక తయారు చేయదలిచారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయదలిచినట్టు తెలుస్తోంది. ఢిల్లీలోనే ఉన్న డీసీఎం డీకే శివకుమార్ పార్టీ అధిష్ఠానం పెద్దలను భేటీ అయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీలను ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అంతకుముందు మల్లికార్జున ఖర్గేతో పలు అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది.

తప్పిన అంచనాలు

మంత్రుల కార్యవైఖరిపై నివేదిక తయారు చేయాలని అగ్రనేత రాహుల్‌గాంధీ సూచించడంతో వైఫల్యంపై మంత్రులు పలు కారణాలు చూపుతున్నారు. బీజేపీ - జేడీఎస్ కూటమితో ప్రబలమైన కులాలకు చెందినవారు ఒక్కటైనట్టు అయ్యిందని మా లెక్కలు దారి తప్పాయని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప అభిప్రాయపడ్డారు. 17-18 స్థానాల్లో గెలుస్తామని భావించామని కానీ మైత్రి కూటమికి పలు కులాలు సంపూర్ణంగా మద్దతు ఇచ్చాయన్నారు. మరో కీలకమంత్రి ఎంబీ పాటిల్ స్పందిస్తూ పార్టీలో ఆత్మావలోకనం జరగాలని అయితే మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుకు మార్కులు సరికాదన్నారు. రాష్ట్రంలో 14 స్థానాలు గెలవలేకపోయామని ఆత్మావలోకనం అవసరమే అన్నారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం పలు కీలకమైన పథకాలు అమలు చేశామని అయినా మా పార్టీకి 9 స్థానాలే దక్కాయన్నారు. మేం ఎక్కడ పొరపాటు పడ్డామో తెలుసుకోవాల్సి ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమికి ఎవరో ఒకరిని బాధ్యులను చేయడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలనేది కీలకం కానుందన్నారు. సీనియర్ మంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ రాహుల్‌గాంధీ సూచనకు మేం కట్టుబడతామన్నారు. నాతో కలిపి ఏఏ జిల్లాల్లో వెనుకబాటుకు కారణమైందే విశ్లేషించాలన్నారు. మంత్రులను రాహుల్‌గాంధీ మందలించడం ఓటమికి కారణమే అన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగానే పరిగణించాల్సి ఉంటుందని అన్ని అంశాలపైనా చర్చలు జరగాలన్నారు. అయితే పార్టీలోనే భిన్నాభిప్రాయాలు జోరందుకున్నాయి. సొంత నియోజవకర్గంలో తమ్ముడిని కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ గెలిపించుకోలేక పోయారనే చర్చలు సాగుతున్నాయి. ఆయన బెంగళూరు ఇన్‌చార్జ్ మంత్రిగాను ఉన్నారని నగర పరిధిలోని 3 ఎంపీ స్థానాల్లోనూ బీజేపీ విజయం సాధించడంపై సమీక్షలు జరగాల్సిందేనన్నారు. ఇక పరమేశ్వర్, రాజణ్ణలు సొంత జిల్లా తుమకూరులోనూ చర్చ జరగాలనే డిమాండ్ ఉంది. ఇలా కీలకనేతల నియోజకవర్గాల్లోనే ఓటమి చవిచూడడంతో వారిపైనా చర్చలు ఉంటాయా అనేది కీలకమవుతోంది.



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునతో డీకే శివకుమార్

యరగోళ్ డ్యామ్‌ను సందర్శించిన కేంద్ర జలకమిషన్



పరిశీలిస్తున్న కేంద్ర జలకమిషన్ అధికారులు

బంగారపేట, జూన్ 9: తాలూకాలోని బూదికోటె హోబళి యరగోళ్ డ్యామ్‌ను కేంద్ర జలకమిషన్ బృందం ఆదివారం సందర్శించింది. యరగోళ్ డ్యామ్ తాగునీటి నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో తమిళనాడు ప్రభుత్వం దావా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర జలకమిషన్ బృందం తన నివేదికను సమర్పించేందుకు డ్యామ్‌ను ఆదివారం సందర్శించారు. కోలారు నుంచి తమిళనాడుకు వృథాగా వెళ్తున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా తాగునీటి అవసరాలకోసం యరగోళ్ డ్యామ్ నిర్మించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా దక్షిణ పినాకిని నది అంతర్రాష్ట్ర వివాదాల నేపథ్యంలో డ్యామ్‌ను సందర్శించారు. 10మంది ఉన్నతాధికారులతో సుమారు 50మంది బృందం యరగోళ్ డ్యామ్‌ను వీక్షించారు.

తాగునీటి ప్రాజెక్టుకు అభ్యంతరంపై ఆగ్రహం

కోలారు జిల్లా బంగారపేట తాలూకాలోని యరగోళ గ్రామంలో వృథాగా వెళ్తున్న నీటిని సద్వినియోగం చేసేలా డ్యామ్ నిర్మించారు. కోలారు, బంగారపేట, మాలూరు పట్టణాలు సహా 45 గ్రామాలకు తాగునీటిని సమకూర్చే ప్రాజెక్టు ఇది. అర్ధ టీఎంసీ సామర్థ్యం నీటి సేకరణ కల్గిన డ్యామ్ ప్రాజెక్టు పూర్తైంది. కావేరి జిల్లా ప్రజలకు ఇది కావేరి నదివలే ఎంతో అనుకూలంగా ఉండి నీటి సమస్యను తీరుస్తోంది. 45 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే డ్యామ్ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చి కొన్ని నెలలు గడిచిన తరుణంలో తమిళనాడు ప్రభుత్వం మాత్రం అభ్యంతరాలను వ్యక్తం చేయడంపై జిల్లా ప్రజల ఆక్రోశానికి కారణమైంది. ప్రాజెక్టుకు సంబంధించి రాజీ సమితి అధ్యక్షుడు కుశ్విందర్ వొహ్రా, సభ్యులు బీపీ పాండె, ఆర్ తంగమణి, నిత్యానంద రై, మనోజ్‌కుమార్, ఆశిశ్‌కుమార్ పాండె, మన్‌మోహన్‌కుమార్ గోయెల్, ఆర్ సుబ్రమణియన్, కే అశోకన్, డాక్టర్ ఎం దీనాదయాలన్ ఉన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ చంద్రప్ప, కార్యనిర్వాహక ఇంజనీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్, అశోక్, తహసీల్దార్ రశ్మి, పురసభ ముఖ్య కార్యనిర్వాహకురాలు మీనాక్షి పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో అలెన్‌కు ఉత్తమ ర్యాంకులు



షాన్ థామస్ (15వ ర్యాంకు) | విదీప్. ఆర్‌జె (36వ ర్యాంకు) | అన్షుల్ జి (37వ ర్యాంకు) | సాగర్.వి (30వ ర్యాంకు) | అభినవ్ (80వ ర్యాంకు)

బెంగళూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో బెంగళూరుకు చెందిన అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆదివారం జేఈఈ అడ్వాన్స్ పరీక్షల ఫలితాలు ప్రకటించగానే జయనగర్‌లోని అలెన్ కోచింగ్ సెంటర్ వద్ద సందడి నెలకొంది. అలెన్ సౌత్ ఇండియా హెడ్ మహేశ్‌యాదవ్ తెలిపిన మేరకు జాతీయస్థాయిలో వందలోపు ఐదుర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. 15వ ర్యాంకును శాన్ థామస్‌కు దక్కగా 30వ ర్యాంకులో సాగర్, 36వ ర్యాంకులో విదీప్ ఆర్ జే, 37వ ర్యాంకులో అన్షుల్ ఉన్నారన్నారు. 80వ ర్యాంకులో అభినవ్ పీజే, 115వ ర్యాంకులో సాయి నవనీత్, 116వ ర్యాంకులో ప్రబుద్ధసిన్హా నిలిచారన్నారు. ఉత్తమర్యాంకులు సాధించినవారంతా పీయూ రెండేళ్లు అలెన్ కెరీర్‌లో చదివినవారన్నారు. ఈ సందర్భంగా శాన్ థామస్ మీడియాతో మాట్లాడుతూ రెండేళ్లక్రిందటిదాకా ఏం సాధించాలనే ఆలోచనలో లేనని అయితే అలెన్ కెరీర్‌లో చేరాకనే ఎంతో అవగాహన పొందానన్నారు. ఐఐటీ ముంబైలో చేరడమే ఆశయమన్నారు. సాగర్ మాట్లాడుతూ 30వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని, నిత్యం అలెన్ అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ఉత్తమ ర్యాంకు సాధించగలిగానన్నారు. విద్యార్థులతో కలసి అధ్యాపకులు నృత్యాలు చేసి సందడిగా గడిపారు.

వైభవంగా శ్రీరాముడి శోభాయాత్ర



పురవీధులలో శోభాయాత్ర

శిడ్లఘట్ట, జూన్ 9: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్తంగా నిర్వహించిన భారీ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఆదివారం పట్టణంలోని హనుమంతపుర గేట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు కళాబృందాలతో ప్రధాన రోడ్లపై సాగింది. ఆంజనేయస్వామి విగ్రహం, శ్రీరాముడి విగ్రహాలతో ఊరేగారు. ముఖ్యఅతిథిగా హారిక మంజునాథ్ పాల్గొని మాట్లాడుతూ 500 సంవత్సరాల నాటి కల సాకారమైందన్నారు. అయోధ్యలో రామమందిరం ఎట్టకేలకు సాధ్యమైందన్నారు. ఆలయాన్ని వీక్షించే సౌభాగ్యం కలగడం మన పూర్వజన్మ సౌభాగ్యంగా పేర్కొన్నారు. స్వామి వివేకానంద ఆదర్శాలు పాటించాలన్నారు. ప్రతి హిందువు భాగస్వామ్యం కావాలన్నారు. దేశభక్తి పెంపొందించుకోవాలని బాలికలు, గోరక్షణకు పాటుపడాలన్నారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం సంతోషంగా ఉందన్నారు. హిందూధర్మరక్షణకు మనమంతా పాటుపడాలని పిలుపునిచ్చారు.



శోభాయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

విద్యతోనే ఉన్నత వ్యక్తిత్వం

బాగేపల్లి, జూన్ 9: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వంటి మహనీయులు అంతటిస్థాయికి చేరుకోవడానికి పట్టుదల, ఉన్నత విద్యతోనే సాధ్యమైందని అలా ముందుకు సాగాలని జమియత్ ఉలేమా సంఘం తాలూకా కార్యదర్శి మౌలానా రియాజుద్దీన్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బెస్కాం కార్యాలయం వెనుకభాగాన గల మసీదు ఆవరణలో ఆదివారం జమియత్ ఉలేమా తాలూకా విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎల్‌సీ ప్రతిభావంత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. అన్ని గ్రంథాలకంటే రాజ్యాంగం గొప్పదన్నారు. రాజ్యాంగం ద్వారానే ప్రజలందరికీ విద్య, ఉద్యోగం, హక్కులు లభిస్తున్నాయన్నారు. అన్నివర్గాలవారు చక్కగా చదువుకుని ముందంజలో ఉండాలన్నారు. విద్యతోనే సమాజంలో ప్రగతి, మార్పు సాధ్యమన్నారు. కార్యక్రమంలో సమితి తాలూకా అధ్యక్షుడు రిజ్వాన్, రిటైర్డు టీచర్ మునీర్ అహ్మద్, గూళూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరావ్, జిల్లా హిందీ టీచర్ల సంఘం కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

టేస్టింగ్‌పౌడర్ వాడకానికి అడ్డకట్ట ఏదీ..?

బాగేపల్లి, జూన్ 9: పలు ఆహార పదార్థాల తయారీలో మోతాదుకు మించి టేస్టింగ్ పౌడర్ వాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. బేకరి, డాబా, ఫుట్‌పాత్ దుకాణాలు, హోటళ్లలోనూ తయారుచేసే పదార్థాలలో రుచికోసం టేస్టింగ్‌సాల్ట్ వాడు తున్నారు. టేస్టింగ్ సాల్ట్ అసలు పేరు మోనో గ్లుటామేట్. ఇది చైనీస్ ఫుడ్, ఇతర ఫాస్ట్‌ఫుడ్ వంటకాలలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇది మోతాదు మించి వాడితే కేంద్ర నాడీ వ్యవస్థపై తీవ్రప్రభావం చూపుతుంది. అలాగే వాంతులు, తలనొప్పి, నొప్పులు, అలసట, ఛాతీపై ఒత్తిడి, గొంతు, అరచేతుల్లో, అరికాళ్లలో మం టలు కూడా వస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి టేస్టింగ్ సాల్ట్ సాధారణ దుకాణాల్లో కూడా లభిస్తోంది. రసాయనాలతో కూడిన టేస్టింగ్ సాల్ట్ ప్రభావం గురించి వైద్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేలా కొన్ని చోట్ల ఇష్టమొచ్చినట్టు వాడుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగ్న వీడియోలతో బెదిరింపులు

» పరువుకోసం నలుగురి ఆత్మహత్యాయత్నం

» ఒకరి మృతి - ముగ్గురు పరిస్థితి విషమం

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మనవరాలి నగ్న వీడియోలను చూపి బెదిరింపులకు పాల్పడ్డంతో పరువుకోసం కుటుంబీకులు నలుగురు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన చామ రాజనగర జిల్లా మలెమహదేశ్వర కొండపై చోటు చేసుకుంది. వెంటనే గుర్తించిన స్థానికులు పోలీ సులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో భయానకం అనిపించే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మైసూరు జిల్లా కేఆర్‌నగర తాలూకా చందగాలు గ్రామానికి చెందిన వ్యక్తి (65), ఆయన భార్య, కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు ప్రయత్నించారు. సదరు వ్యక్తి చికిత్సలు ఫలించక శనివారం మృతి చెందాడు. మిగిలినవారు ఆసుపత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నారు. యువతి కేఆర్ నగర్ తాలూకా చీరనహళ్లికి చెందిన యువకుడు లోకేశ్‌తో స్నేహంగా ఉండేవారు. అది కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు సన్నిహితంగా ఉన్నప్పుడు సదరు యువకుడు కొన్ని ఫోటోలు, వీడియోలు తీసుకున్నాడు. యువతికి సంబంధించిన నగ్న వీడియోలు చూపి బెదిరింపులు ప్రారంభించాడు. తరచూ డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు పిలిచినప్పుడు రావాలని వేధించాడు. యువతి నిరాకరించడంతో ఏకంగా కుటుంబ సభ్యులకే సదరు వీడియోలను పంపాడు. అంతటితో ఆగకుండా సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. దీంతో కుటుంబ పెద్ద పరువు పోతుందని భావించాడు. ఇరుగు పొరుగువారికి బంధువులకు మలె మహదేశ్వర ఆలయానికి వెళ్తున్నట్టు చెప్పారు. కొండపై దర్శనం చేసుకుని ఆ తర్వాత తాళిబెట్టకు వెళ్లి నలుగురు క్రిమిసంహారక మందు తాగారు. కుటుంబ పెద్ద మృతి చెందగా మిగిలిన ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు. మహదేశ్వర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ముగ్గురూ చామరాజనగర జిల్లా కేంద్రమైన సిమ్స్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మొత్త మ్మీద పరువుకు భయపడి కుటుంబం ఆత్మహత్యకు ప్రయత్నిం చడం, వారిలో ఒకరి మృతి చెందడంలో చామరా జనగర జిల్లాలో సంచలనం కలిగించింది. ఇలాంటి ఘటనలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోస్టింగ్ కోసం పైరవీలు

హిందూపురం, జూన్ 9: సార్వత్రిక ఎన్నికలతో రాష్ట్రంలో ముఖచిత్రం మారింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఘోర పరాజయం చవిచూపింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటవుతోంది. మొన్నటివరకు వైసీపీ నాయకులు చెప్పిన మేరకు అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పనిచేశారు. ఎన్నికల ముందు ఈసీ బదిలీలు చేపట్టింది. వాటిలో సైతం రాజకీయ జోక్యం మితిమీరిందనే చెప్పవచ్చు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ అయిన అధికారులు సైతం నిబంధనలు పక్కన పెట్టి, వైసీపీ సేవలో తరించారు. దీంతో రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సైతం పక్కన పెట్టింది. ఈ పరిస్థితుల్లో పోస్టింగ్ కోసం అధికారులు నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇలా మారిందో లేదో.. పోస్టింగ్ కోసం పైరవీలకు తెరలేపారు. పోలీసు శాఖలో పోటీ పడుతున్నారు. ప్రభుత్వం కొలువు తీరకుండానే పైరవీలు ముమ్మరం చేశారు. ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడానికి ముందు నుంచి టీడీపీ అధికారంలోకి వస్తుందని భావించి కొంత మంది ప్రయత్నాలు ప్రారంభించారు. కూటమి గెలవడంతో మరింతమంది అధికారులు.. టీడీపీ ఎమ్మెల్యే వద్దకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే అధికారులు కొన్నిరోజులు తమను ఇక్కడే ఉండనీయండని ప్రాధేయపడుతున్నారు. మరి కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి రావడానికి పోటీ పడుతున్నారు. సాధారణంగా పాలకపక్షం మారితే మొదట ఏ నాయకుడైనా కదిలించేది పోలీసులనే. మొన్నటి వరకు పోలీసు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. కొంతమంది పోలీసు అధికారులైతే ఖాకీ చొక్కా వేసుకున్నామనే ఆలోచన కూడా లేకుండా వైసీపీతో అంటకాగారు. ఈనేపథ్యంలో కొన్నిరోజులైనే ఇక్కడే ఉంచాలని కోరుతుండగా, మరికొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే బదిలీల జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఇతర జిల్లాలో ఉన్నవారు రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

వర్మపై దాడి.. పవన్ సీరియస్..!



- వన్నెపూడి ఘటనపై విచారణకు ఆదేశం
- కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు
- వారం రోజుల్లో పిఠాపురానికి జనసేనాని
- నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు
- జనసైనికులు సంయమనం పాటించాలి: నాగబాబు

అమరావతి (ఆంధ్రజ్యోతి), పిఠాపురం, జూన్ 9: పిఠాపురంలో జనసేన గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన మాజీ ఎమ్మెల్యే వర్మపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన దాడిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరున్నారు..? అనే దానిపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీనిపై విచారణ జరిపే బాధ్యతలను పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ అప్పగించారు. ప్రస్తుతం ఆయన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఈ నెల 12న జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బిజీబిజీగా ఉంటారు. అనంతరం ఆయన పిఠాపురం వెళ్లి అక్కడ పరిస్థితిని చక్కదిద్దనున్నారు. ఈ లోగా సంఘటనకు కారణాలు, ఇతర అంశాలపై పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నివేదిక సిద్ధం చేయాని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగానే పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాలొన్నట్టు తెలిస్తే మాత్రం వారిపై తీవ్ర చర్యలు ఉంటాయన్న హెచ్చరికలు పంపించారు. తప్పు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించది లేదని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఇప్పటికే హెచ్చరించారు. అధినేత పవన్ కల్యాణ్ వచ్చిన తర్వాత ఘటనపై తుదినిర్ణయం తీసుకోనున్నారు.

ఘటనపై వివరాలు సేకరిస్తున్నాం: నాగబాబు

వన్నెపూడిలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మపై జరిగిన దాడి, తదనంతర పరిణామాలు పార్టీ దృష్టికి వచ్చాయని, దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆదివారం తెలిపారు. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఇందులో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుచేసిన వారిని ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన గురించి తమకు సమాచారం ఉందని, పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక నేతలతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. జనసైనికులందరూ సంయమనం పాటించాలని కోరారు. సాధ్యమైనంత వరకూ తాను కూడా నియోజకవర్గంలోనే అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏమైనా ఉంటే కూర్చొని పరిష్కరించుకుందామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మారు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తిరుమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మి ఓటు వేశారని, దీనిపై చర్చ ఎందుకని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఓడిపోవడంపై స్పందిస్తూ 'ఇది ప్రజాతీర్పు అన్నారు. ఆ తీర్పుకు శిరసా వహించాల్సిందే. సీన్ ఈజ్ ఓవర్ అన్నారు. 40 శాతం ఓట్లు వచ్చాయని ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి తెలిపారని, అక్కడినుంచి నిలబడి వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. ఇదే తమ ప్రధాన అజెండా అని చెప్పారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి గిరిజనులంతా తరలిరావాలి: ధారునాయక్

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి గిరిజనులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఘనవిజయం సాధించిన కూటమి తరఫున ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించే దినంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. 16గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ సర్కార్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన గిరిజనులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో గిరిజనులు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

వీసీలు స్వచ్ఛందంగా తప్పుకోవాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి,జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులందరూ వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం బలవంతంగా తొలగించక ముందే స్వచ్ఛందంగా తప్పు కోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, ముఖ్యంగా ఆంధ్రావర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, నాగార్జున వర్సిటీ వీసీ రాజశేఖర్ వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. వర్సిటీల్లో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంపై దృష్టి పెట్టకుండా, వర్సిటీలను వైసీపీ కార్యాలయాలుగా మార్చారు. అత్యుత్సాహంతో వర్సిటీల్లో వైఎస్సార్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ఘన విజయంతో అధికారం చేపడుతున్నా, ఇంకా ఏ ముఖం పెట్టుకుని, వీసీ పదవుల్లో కొనసాగుతారని మండిపడ్డారు.

బాబు పాలనలో ఏపీ అభివృద్ధి చెందాలి

- కాబోయే సీఎంకు నవీన్ పట్నాయక్ అభినందనలు

భువనేశ్వర్, జూన్ 9: టీడీపీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలని బీజేడీ చీఫ్, ఒడిసా ఆపద్ధర్మ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించినందుకు చంద్రబాబును అభినందించారు. చంద్రబాబుతో మాట్లాడి అభినందనలు తెలియజేశానని ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన రాజకీయ జీవితంలో చంద్రబాబుతో సుదీర్ఘ అనుబంధం ఉందని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించగా, వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే.

హైవేపై ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- బెంబేలెత్తిన వాహనదారులు.. కాంట్రాక్టర్ కక్కుర్తే కారణం
- కత్తిపూడి- ఒంగోలు హైవేపై తప్పిన పెను ప్రమాదం



గుడివాడ, జూన్ 9: కాంట్రాక్టర్ కక్కుర్తి ఫలితంగా ఏకంగా జాతీయ రహదారి పైనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారిపై ఒక్కసారిగా స్తంభాలు వంగిపోవడంతో వాహనదారులు బెంబెలెత్తిపోయారు. గుడివాడ మండలం రామనపూడి గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం సుమారు 11.30 గంటలకు ఒక్కొక్కటిగా 7 స్తంభాలు నెలకొరిగాయి. అయితే ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒరిగిన స్తంభాలు దాదాపుగా రహదారికి సగానికి పైగా ఆక్రమించడంతో ప్రమాదకరంగా మారాయి. కాగా, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. విద్యుత్ అధికారులు తీరిగ్గా సాయంత్రం 5 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి వైర్లను కత్తించారు. స్తంభాలను యథావిధిగా వదిలేశారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయలేదు. దాదాపు ఐదున్నర గంటలపాటు ప్రజలు ఆ ప్రాంతంలో బిక్కుబిక్కు మంటూ గడిపారు. ఇక, ఈ స్తంభాలను వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ నాసి రకంగా వేశారు. స్తంభాలు నిలబెట్టే క్రమంలో సరైన ఫౌండేషన్ వేయలేదు. కక్కుర్తిగా పనులు చేపట్టడంతో అవి ఒరిగిపోయాయి. కాంట్రాక్టర్ వైసీపీ ముఖ్య అనుచరుడు కావడంతో అధికారులు నోరుమెదపలేక పోయారన్న ప్రచారం సాగుతోంది.



గేట్లకు రోప్ లేకుండా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు



అసంపూర్తిగా జీడీపీ ఆనకట్ట బలోపేతం పనులు

'గాజులదిన్నె'కు గండం!

- గేట్లు పెట్టారు.. రోప్ కనెక్షన్లు మరిచారు
- వరద పోటెత్తితే గేట్లు తెరిచే అవకాశమే లేదు
- 30 కోట్ల బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు
- మరో 'అన్నమయ్య డ్యాం' కాకముందే స్పందించాలి
- సాగునీటి నిపుణులు, రైతుల వినతులు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రమాదంలో పడింది. జగన్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కారణంగా ఇప్పటికే కడప జిల్లాలో అన్నమయ్య డ్యాం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అక్కడో ప్రాజెక్టు ఉందనే ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో గాజులదిన్నె జలాశయానికీ అలాంటి ముప్పే పొంచి ఉంది. ప్రాజెక్టు ఆధునీకరణ, మరమ్మతుల్లో భాగంగా కొత్త గేట్లు బిగించారు. అయితే వాటి నిర్వహణకు వీలుగా రోప్స్, లైనాప్ ప్లేట్లు వంటివి ఏర్పాటు చేయలేదు. డ్యాం ఎగువన వర్షాలు పడుతున్నాయి. వరద పోటెత్తితే గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు జగన్ ప్రభుత్వంలో రూ.30 కోట్లు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలలు క్రితమే కాంట్రాక్టరు చేతులెత్తేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించకపోతే గాజులదిన్నె కూడా అన్నమయ్య ప్రాజెక్టు తరహాలో ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ జిల్లాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లా గాజులదిన్నె (దామోదరం సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు ఒకటి. కర్నూలు జిల్లా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ, డోన్ మండలాల్లోని పలు గ్రామాల్లో రబీ పంటలకు 24,372 ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం, కృష్ణగిరి, డోన్ పట్టణాలతో పాటుగా 125 గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే అందుతోంది. బండగట్టు రక్షిత మంచినీటి పథకం ద్వారా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 80 గ్రామాలకు పైగా తాగునీరు అందించాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తాగునీటి అవసరాల కోసం హంద్రీనీవా కాలువ నుంచి 3 టీఎంసీల నీటిని కేటాయించారు. దీంతో జలాశయం సామర్థ్యం 7.5 టీఎంసీలకు పెంచాలనే లక్ష్యంగా రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ తర్వాత జగన్ ముఖ్యమంత్రిగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సవరించి 5.5 టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ రూ.37 కోట్లతో ఆనకట్ట బలోపేతం, ఎత్తు పెంచడం వంటి పనులు చేపట్టారు. మరో రూ.12కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ పనులను బీఎన్‌వీ కన్‌స్ట్రక్షన్, శ్రీశ్రీ విఘ్నేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థలు దక్కించుకోగా.. విజయవాడకు చెందిన కాంట్రాక్టరు కోటిరెడ్డి సబ్ కాంట్రాక్టు తీసుకుని 2022 ఏప్రిల్ 26న పనులు చేపట్టారు.

భారీ వరదొస్తే తిప్పలే

గాజులదిన్నె ప్రాజెక్టు ఆరు గేట్ల డిశ్చార్జ్ కెపాసిటీ (వరద విడుదల సామర్థ్యం) 80 వేల క్యూసెక్కులు. ఈ గేట్లకు దశాబ్దాలుగా మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపట్టాయి. నిర్వహణ కష్టంగా మారింది. కొత్త గేట్ల ఏర్పాటులో భాగంగా 2023 సెప్టెంబరులోనే ఫ్యాబ్రికేషన్ (తయారీ), ఎరక్షన్ (పాతవాటి స్థానంలో కొత్త గేట్లు అమర్చడం) వంటి పనులు పూర్తి చేశారు. వాటిని కిందకు, పైకి ఎత్తేందుకు(లిఫ్ట్) వీలుగా రోప్ కనెక్షన్లు, లైనాప్‌ప్లేట్స్ వంటి కీలకమైన పనులు చేయాల్సి ఉంది. చిన్న పనులే అయినా గేట్ల నిర్వహణలో ఇవే కీలకం. ఆనకట్ట బలోపేతం, గేట్ల ఏర్పాటు పనులకు దాదాపు రూ.30 కోట్ల మేర బిల్లుల చెల్లింపునకు జగన్ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేయలేనంటూ కాంట్రాక్టరు చేతులెత్తేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. కాగా ఆదివారం (9వ తేదీ) నాటికే 97.9 మి.మీ. కురిసింది. 3శాతం అధిక వర్షపాతం నమోదైంది. జలాశయం ఎగువన పత్తికొండ మండలంలో 89.9 మి.మీ.కు గానూ 154.6 మి.మీ. (72% అధికం), ఆలూరు ప్రాంతంలో 77.5 మి.మీ.కు గానూ 108.2 మి.మీ.(40% అధికం), మద్దికెర మండలంలో 70.2 మి.మీ.కు గానూ 77.4 మిల్లీమీటర్లు (10% అధికం) వర్షం పడింది. రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అదే జరిగితే డ్యాంకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ దాటి వరద పోటెత్తితే గేట్లు ఎత్తాల్సి వస్తుంది. కొత్తగేట్లకు రోప్స్, లైనాప్ ప్లేట్ల పనులు చేయకపోవడంతో ఆనకట్టకు గండి కొట్టకపోతే కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. కడప జిల్లాలో 2022 నవంబరులో అధిక వరద అన్నమయ్య ప్రాజెక్టుకు పోటెత్తడంతో ఒక గేటు రోప్ తెగిపోయి అడ్డంగా ఇరుక్కుపోవడంతో పైకి ఎత్తలేని పరిస్థితి. సామర్థ్యానికి మించి వరద రావడంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. అలాంటి పరిస్థితులు రాకముందే గాజలదిన్నె ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు పూర్తిచేసి నిర్వహణకు అనుకూలంగా రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టుకు కొత్తగా ఏర్పాటు చేసిన గేట్లు

తక్షణమే మరమ్మతులు చేపడతాం

గాజులదిన్నె ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేశాం. రోప్స్, లైనాప్ ప్లేట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. భారీ వరదలు వస్తే ఆనకట్టకు ప్రమాదం ఉన్న మాట నిజమే. కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి తక్షణమే మిగిలిన పనులు చేయిస్తాం. ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

\- కబీర్‌బాషా, సీఈ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కర్నూలు



వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి 99 కోట్లు

- అసెంబ్లీలో 79% మంది నేరచరితులే
- 138 మందిపై క్రిమినల్ కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాజాగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలలో 138 (79%) మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 98 మందిపై సీరియస్ క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎమ్మెల్యేల్లో 162 మంది సంపన్నులు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 174 మంది అఫిడవిట్లను విశ్లేషించిన ఏడీఆర్ శనివారం ఓ నివేదిక విడుదల చేసింది. టీడీపీ తరఫున పుట్టపర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె సింధూర రెడ్డి అఫిడవిట్‌ను విశ్లేషించలేదు. 2019లో ఎమ్మెల్యేలుగా గెలిచినవారిలో 96 (55%) మందిపై క్రిమినల్ కేసులుండగా ఈసారి వారి సంఖ్య మరింత పెరిగింది. ముగ్గురిపై హత్య, 32మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. 22మందిపై మహిళలపై దాడులకు పాల్పడిన కేసులు ఉండగా, ఒక ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదైంది. పార్టీలవారీగా చూస్తే టీడీపీ తరఫున గెలిచిన 134మంది ఎమ్మెల్యేలలో 115 మంది, బీజేపీ టికెట్‌పై గెలిచిన 8 మంది, జనసేన తరఫున విజయం దక్కించుకున్న 10 మంది, వైసీపీ తరఫున గెలిచిన ఆరుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. సీరియస్ క్రిమినల్ కేసులు నమోదైన వారిలో టీడీపీలో 82మంది, బీజేపీలో ఐదుగురు, జనసేనలో ఏడుగురు, వైసీపీలో నలుగురు ఉన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల ఆస్తులే ఎక్కువ

గత అసెంబ్లీ ఎన్నికలలో 163 మంది కోటీశ్వరులు గెలవగా ఈసారి 162మంది గెలిచారు. టీడీపీలో 127, జనసేనలో 18, వైసీపీలో 9, బీజేపీలో 8 మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులేనని ఏడీఆర్ తెలిపింది. ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ ఈసారి రూ.65.07 కోట్లు ఉండగా, గత అసెంబ్లీలో రూ.27.87 కోట్లుగా ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.67.97 కోట్లు ఉండగా, వైసీపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.99.19 కోట్లుగా ఉంది. బీజేపీ శాసనసభ్యుల సగటు ఆస్తుల విలువ రూ.34.29 కోట్లు, జనసేన ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.40.43 కోట్లుగా ఉంది.

- టీడీపీ అధినేత చంద్రబాబు రూ.931 కోట్ల ఆస్తితో అగ్రస్థానంలో ఉన్నారు. రెండోస్థానంలో నారాయణ రూ.824 కోట్లు, వైఎస్ జగన్ రూ.757 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు.
- మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎం. ఎస్ రాజుకు అందరికంటే అతి తక్కువగా రూ.12 లక్షల ఆస్తి ఉంది.
- రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీష రూ.19 లక్షలు, కర్నూల్ ఎమ్మెల్యే జయసూర్యకు రూ.21 లక్షల ఆస్తులున్నాయి.
- పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ కుటుంబ ఆదాయం దాదాపు రూ.73 కోట్లు ఉంది.
- విద్యార్హతల వారీగా చూస్తే.. 49 మంది ఎమ్మెల్యేలు 5 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు.
- 122 మంది డిగ్రీ ఆపై ఉన్నత విద్యావంతులు. ముగ్గురు డిప్లొమా చేశారు.
- వయసుల వారీగా చూస్తే.. 12 మంది 25-40 ఏళ్ల మధ్య, 118 మంది 41-60 ఏళ్ల మధ్య 43 మంది 61-80 ఏళ్ల మధ్య ఉన్నారు. ఒక ఎమ్మెల్యే వయసు 82 ఏళ్లు.

సీఐడీ ఆధీనంలో 'బేవరేజెస్'

- కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు
- ఫైళ్లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో మద్యం విక్రయాల్లో జరిగిన అవకతవలను నిగ్గుతేల్చేందుకు సీఐడీ దూకుడు పెంచింది. రెండు రోజులుగా విజయవాడ ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో సోదాలు చేస్తోంది. బేవరేజెస్ ఎండీ కార్యాలయం మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోపిడీయే లక్ష్యంగా ప్రభుత్వ షాపుల ద్వారా అమ్మకాలు సాగించి, కమీషన్లు కొల్లగొట్టిన వైనంపై విచారణ చేస్తోంది. ఇష్టానుసారం ధరలు పెంచేసి, కమీషన్ల రూపంలో వేల కోట్లు దండుకున్న వ్యవహారంలో ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. ఐదు అంతస్తులున్న భవనంలో మొదటి రెండు ఫ్లోర్లు ఎక్సైజ్ కార్యాలయంగా వాడుకుంటున్నారు. పై మూడంతస్తులు కార్పొరేషన్‌కు సంబంధించినవి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయానికి వచ్చి ఫైళ్లు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు అందడంతో ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సీఐడీ సోదాలు చేపట్టింది. అక్కడినుంచి వచ్చిన తర్వాత బేవరేజెస్ ఎండీ కార్యాలయాన్ని సీజ్ చేసింది. బయట పోలీసుల్ని కాపలా పెట్టి సీఐడీ అధికారులు లోపల సోదాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సోదాలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో ఒక బాక్సు(కేసు) లిక్కర్‌పై రూ.250, బీరు కేసుపై రూ.150 చొప్పున వసూళ్లు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నారు. ఏడాదికి నాలుగు కోట్ల కేసులకు తగ్గకుండా ఐదేళ్లలో 20 కోట్ల కేసుల మద్యం విక్రయించి వేల కోట్లు దండుకున్న అక్రమార్కులను గుర్తించే పనిలో ఉన్నారు. కమీషన్ల రూపంలో దోచుకున్న వేల కోట్లలో జగన్‌కు వాటా వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఆ డబ్బు దాచి, అందులో కొంత ఎన్నికల్లో ఖర్చు చేశారని, మిగిలిన డబ్బంతా బెంగళూరుకు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా..

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 2019 అక్టోబరులో ప్రభుత్వ మద్యం షాపుల్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3500 మద్యం షాపులను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్యం షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలనేది ప్రభుత్వమే నిర్ణయించేది. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని మద్యం కంపెనీలకు వైసీపీ పెద్దలతో ప్రతిపాదన పెట్టించింది. ఇందుకు కంపెనీలు అంగీకరించలేదు. దీంతో... 'మీకు నష్టం జరగకుండా మద్యం ధర పెంచుతాం. ఆ పెంచిన ధరను తిరిగి కమీషన్ రూపంలో ఇవ్వండి' అనే విధానం తెచ్చారు. అందుకు కొన్ని కంపెనీలు అంగీకరించాయి. ప్రముఖ బ్రాండ్ల ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో ఆయా కంపెనీల బ్రాండ్లను షాపుల్లో విక్రయించడం ఆపేశారు. 2020 జనవరి నుంచి వైసీపీ ప్రభుత్వ మద్యం షాపుల్లో జగనన్న బ్రాండ్లను విక్రయించింది. అలా అమ్మిన ప్రతి లిక్కర్ కేసు నుంచి వైసీపీ పెద్దలకు ముడుపులు అందాయి. గత ఐదేళ్లలో అమ్ముడైన లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలు వ్యవహారాన్ని హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి మొత్తం సీజ్ చేయడంతో దుకాణాన్ని బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ పెద్దల సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించారు. ఆ తర్వాత అనేక మంది వచ్చారు. సీఐడీ వీరందరికీ నోటీసులు పంపి విచారించే అవకాశం ఉంది. మద్యం బాటిళ్ల కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా 5 వేల కోట్లకు పైగానే దోపిడీ చేసినట్లు తెలుస్తోంది.

రెండు రాష్ట్రాల్లో ఎంత తేడా...

మేన్షన్ హౌస్ బ్రాందీ 180మి.లీ. క్వార్టర్ బాటిల్ కేసు (48 సీసాలు) ఏపీ బేవరేజెస్ కంపెనీల నుంచి రూ.1697కు కొనుగోలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం దాన్ని రూ.1094కు తీసుకుంది. అంటే ఓ కేసు ధరలో వ్యత్యాసం రూ.603. ఈ మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు అనధికారికంగా చేరినట్లు ఆరోపణలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వం మద్యం షాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.220కి విక్రయించగా, తెలంగాణలో రూ.170కే అమ్మారు. ఇలా పేదలకు అధిక ధరలకు మద్యం అంటగట్టి వేల కోట్లు వెనకేసుకున్నారు.


వాసుదేవరెడ్డి నుంచి సజ్జల దాకా..

జగన్ పాలనలో మద్యం దోపిడీ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో పలువురు కీలకంగా పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకు మాత్రమే ఎండీ వాసుదేవరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డర్లు వెళ్లేవి. తమకెందుకు ఇవ్వరని ఇతర ఉత్పత్తిదారులు ప్రశ్నిస్తే.. ఏదో మమ అనిపించేవారు. ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, వాటిని ఎవరూ కొనట్లేదని వెనక్కి పంపేవారు. ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలన్నది సజ్జల రామకృష్ణారెడ్డి నిర్ణయించేవారు. ప్రతిరోజూ ఉదయం సజ్జల నుంచి బ్రాండ్ల చార్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు వెళ్లేది. ఆయన దాన్ని మద్యం డిపో మేనేజర్లు, షాపుల్లో సేల్స్‌మెన్‌కు పంపేవారు. దాని ప్రకారం మద్యం విక్రయించేవారు. మద్యం కంపెనీలకు బకాయిల విడుదల వ్యవహారాలను కార్పొరేషన్‌లో పదవీ విరమణ చేసిన వేణుగోపాల్ చూసేవారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ తీసుకుని బకాయిలు విడుదల చేసేవారు. మరో రిటైర్డ్ అధికారి శ్రీనివాసరెడ్డి 3నెలలుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా కంపెనీల నుంచి గ్రౌండింగ్ చార్జీలు వసూలు చేశారు.

బెట్టింగులే బలిగొన్నాయా?!

- అనుమానాస్పద స్థితిలో వైసీపీ నాయకుడి మృతి
- ఎన్నికల ఫలితాల రోజు నుంచి అజ్ఞాతంలోనే..

నూజివీడు టౌన్, జూన్ 9: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పుదిగవల్లి వైసీపీ నాయకుడు జగ్గవరపు వేణుగోపాలరెడ్డి ఆదివారం అనుమానాస్పద స్థితిలో తన మామిడి తోటలోని షెడ్డు వద్ద మృతి చెందారు. తూర్పు దిగవల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భర్త అయిన వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీల గెలుపు, ఓటములపై పలు బెట్టింగ్‌లకు మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం. దాంతో పాటు తాను సైతం భారీగా బెట్టింగులు కాసి డబ్బు కోల్పోయినట్టు చెప్పుకొంటున్నారు. దాదాపు 30 కోట్ల రూపాయల వరకు ఎన్నికల బెట్టింగుల్లో మధ్యవర్తిగా లేదా ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల రోజు నుంచి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు కనిపించలేదు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం పలువురు పందెం రాయుళ్లు వేణుగోపాల్‌రెడ్డి ఇంటిపై దాడి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున అతడు తన మామిడి తోటలోని షెడ్డు వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.



వేణుగోపాల్‌రెడ్డి



జిమ్‌కు తిరిగి ఎన్టీఆర్ పేరు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్, సాయి తదితరులు

మళ్లీ 'ఎన్టీఆర్ జిమ్'గా..

- గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
- వందలాదిగా పాల్గొన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు
- 'ఎన్టీఆర్'ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు: బ్రాహ్మణ చైతన్య వేదిక

గుంటూరు, జూన్ 9: గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ జిమ్ పేర్లను మార్చేందుకు గత వైసీపీ పాలకులు చేసిన కుట్రలను బ్రాహ్మణ చైతన్య వేదిక భగ్నం చేసింది. ఆ మేరకు స్టేడియంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ధ్వంసం చేశారు. స్టేడియంలోని జిమ్ నూతన భవనంపై 'ఎన్టీఆర్ జిమ్' అంటూ భారీ అక్షరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ మాట్లాడుతూ ఎవరైనా అన్న ఎన్టీఆర్ పేరును టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ స్టేడియంను వైఎస్సార్ స్టేడియంగా పేరు మార్చేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులతో అధికారులు కుట్రపన్నారన్నారు. అందుకోసమే స్టేడియంలో నూతన భవన నిర్మాణం చేపట్టి వైఎస్సార్ జిమ్‌గా పేరు పెట్టేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దీనిపై తాము హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, అయినా.. మున్సిపల్ అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై నిర్మాణ పనులు ఆపకుండా అక్రమంగా కొనసాగించారని విమర్శించారు. హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉన్నా, ఎన్నికల కోడ్ ఉన్నా అప్పటి మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు వైఎస్సార్ పేరుతో శిలాఫలకాలు ప్రారంభించేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. దీనిపైనా తాను హైకోర్టులో మరో పిల్ వేయగా వైసీపీ ప్రజా ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. భవన నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.49 లక్షలు కేటాయించినట్లుగా చూపి ప్రజాధనాన్ని నొక్కేశారని, నూతన ప్రభుత్వం తక్షణమే ఆడిట్ జరిపించి ఆ డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు.

బలమైన ప్రతిపక్షంతోనే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం!

- వచ్చే ఐదేళ్లు కేంద్రంలో మంచి పాలన: రజనీకాంత్
- చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణస్వీకారానికి వెళతానని వెల్లడి



చెన్నై, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బలమైన ప్రతిపక్షాన్ని ప్రజలు ఎన్నుకొన్నారని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతమని తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఢిల్లీకి బయలుదేరిన ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఐదేళ్లు కేంద్రంలో ఎలాంటి పాలన ఉంటుందని భావిస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, మంచి పాలన ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికైన ఘనతను మోదీ సాధించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి తనను ఆహ్వానిస్తే తప్పకుండా హాజరవుతానని రజినీకాంత్ తెలిపారు.

పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. జ్యోతి శ్రీవాస్తవ పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆ తల్లులకు వందనం

“అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారట. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ ‘ఐవైసీఎఫ్’ (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే ‘చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్’ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో ‘లిటిల్ చెర్రీ మామ్’ పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. ‘ఈమెకేం తెలుసు’ అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. ‘నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు’ అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.



మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత ‘లిటిల్ చెర్రీ ఫుడ్స్’ కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్ట్‌లకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్నిచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం.”

మార్పు యోధులు...

వారియర్స్ వితవుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష అత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే ‘వారియర్స్ వితవుట్ ఎ కాజ్’. “ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ల కాళ్లమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం” అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్, ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

“అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం” అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన ‘బీట్ ది హీట్’ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. “వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం” అని చెబుతున్న ‘వారియర్స్’ ద్వారా గత మూడేళ్లలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై ‘సమరసింహ’మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట ‘సింహ’నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.



తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో ‘తాతమ్మ కల’ (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.

భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.

తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టిపడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.

క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మోహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు స్మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by G.V. Srikanth, on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Abhimani Publications Press, 2/4, Dr. Rajakumar Road, Rajaji Nagar, Bengaluru - 560 010 and Published from Andhra jyothi, No: 590, 2nd Floor, 4th Cross, 108-B Bus Stop, RT Nagar, Bengaluru - 560 032 on behalf of from No: 9, First Floor, Muniswamy Road, Queens Road Cross, Bengaluru - 560 051. Phone No: 23331000, 23335000, Editor: K. Srinivas. RNI No: KARTEL/2006/19826, Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.